క్లుప్తంగా

కేటీఆర్ సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సుమన్



హసన్‌పర్తి: కేటీఆర్ సేన వర్ధన్నపేట నియోజ కవర్గ ఇన్‌చార్జ్‌గా ముచ్చర్లకు చెందిన చిర్ర సుమన్‌గౌడ్ నియమితులయ్యా రు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనో హర్ ప్రకటించారు.నియామకానికి సహకరించిన నాయకులకు సుమన్ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాస్థాయి అబాకస్ పరీక్షలో మాన్విక ప్రతిభ



ఖిలా వరంగల్ : ఇటీవల కాజీపేట బిషబరేట్ హైస్కూల్ ప్రాంగణంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పరీక్షలో వరంగల్ కరీమాబాద్‌లోని న్యూకౌటి ల్యాస్ సెయింట్ అమెన్ హైస్కూల్ విద్యార్థిని మాన్విక ద్వితీయ స్థానం సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. సోమవారం స్కూల్‌లో మాన్వికకు కరస్పాండెంట్ కోడెం శ్రీధర్, ప్రిన్సిపాల్ సబిత అభినందించారు

త్రోబాల్ చాంపియన్ షిప్‌నకు కృష్ణవేణి ఎంపిక



కేయూ క్యాంపస్ : కాంబోడియాలో ఈ ఏడాది మార్చి 28 నుంచి 30వ తేదీ మధ్య జరగబోయే ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కేయూ కామర్స్ విభాగం పరిశోధక విద్యార్థిని ఎం.కృష్ణవేణి ఎంపికైంది. విద్యార్థినిని సోమవారం వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ డి ఫరెంట్లీ ఏబుల్డ్ సెల్ డైరెక్టర్ రాజు అభినందించారు.

'కుర్సా' క్యాలెండర్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా) రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను సోమవారం కేయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, బాధ్యులు రాజేందర్, విష్ణువర్దన్, రాజేందర్, జానకి రాములు, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

రజనీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు వరంగల్ మండిబజార్‌కు చెందిన జన్ను రజనీకి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. వర్కింగ్ ఆఫ్ నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ-ఏ స్టడీ ఆఫ్ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రజనికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎం.సత్యవతి పర్యవేక్షణలో రజని తన పీహెచ్‌డీ పూర్తి చేసింది.

రోడ్ల విస్తరణ చేపట్టాలి

ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే అధికారులకు మంత్రి ఆదేశించడంతో పాటు నగరాభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు

అరెస్ట్ హేయమైన చర్య

కేయూ క్యాంపస్: మైలారం గుట్ట మైనింగ్ అక్రమ తవ్వకాలను నిలిపివేయాలంటూ అక్కడికి వెళ్లిన ప్రొఫెసర్ హరగోపాల్‌ను, లక్ష్మణ్‌లను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.వంశీకృష్ణ, కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో వారు మాటాడుతూ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తక్షణమే అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సన్మానం

ఖిలా వరంగల్ : రంగశాయిపేట ప్ర భుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ప్రి న్సిపాల్ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రట రీగా ఎన్నికైన సందర్భంగా సోమవారం అధ్యాపకులు శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు.

నెరవేరనున్న పట్టణ ప్రజల కల

- కాజీపేట చౌరస్తా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- త్వరితగతిన చేపట్టాలని ప్రజల ఆకాంక్ష



అభివృద్ధికి ప్రతిపాదించిన కాజీపేట చౌరస్తా



కొలతల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

కాజీపేట : పట్టణ ప్రజలు పుష్కరకాలంగా ఎదురు చూస్తున్న చౌరస్తా అభివృద్ధి పనుల కల త్వరలో నెరవేరబోతుంది. ఇటీవల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జిల్లా అధికారులతో కలిసి పలు దఫాలుగా చౌరస్తాలో పర్యటించి అభివృద్ధి పనులు చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలించారు. ట్రైసిటీగా పేరుగాంచిన గ్రేటర్ వరంగల్‌కు స్వాగత తోరణంగా ఉన్న కాజీపేటను ఓ అందమైన చౌరస్తాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. ఒక పక్క కాజీపేట రైల్వే జంక్షన్ ఆవరణలో రూ. 8.50 కోట్లతో పనులు సాగుతున్నాయి. మరో పక్క చౌరస్తాను మోడల్‌గా మారిస్తే తప్ప ప్రయోజనం ఉండదనే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నారు. చౌరస్తా అభివృద్ధిపై మున్సిపల్, కుడా, ఎన్‌హెచ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా ఓ కా ర్యాచరణ ప్రణాళికను రూపొందించారు. కాజీపేట చౌరస్తాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై రూ.2.65 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు త యారు చేసే పనిని ఇంజనీరింగ్ అధికారులు ఇటీవలే పూర్తి చేశారు.

బోసిపోయి కనిపిస్తున్న చౌరస్తా

వివిధ అవసరాల రీత్యా వరంగల్ నగరానికి వచ్చే పర్యాటకులకు కాజీపేట చౌరస్తాలో అభివృద్ధి పనులు లేక బోసిపోయి కనిపిస్తోంది. ఎటుచూసినా ఎండిన మొక్కలు, కూలిన, శిథిలావస్థలో ఉన్న భవనాలు వెక్కిరిస్తుంటాయి. ఉమ్మడి జిల్లాకు తలమానికంగా ఉన్న రైల్వే జంక్షన్ ఈ చౌరస్తాకు కూతవేటు దూరంలోనే ఉన్నా అభివృద్ధి శూన్యమనే చెప్పాలి.

జీరో సర్కిల్‌లో అభివృద్ధి ఉత్తమం

కాజీపేట చౌరస్తా అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉన్న భవనాలతో పాటు రైల్వే స్టేడియంను తొలగించి జీరో సర్కిల్ రూపంలో అభివృద్ధి చేయడం ఉత్తమంగా ఉంటుందని ప్రజలు రాజకీయ పార్టీలకతీతంగా అభిప్రాయ పడుతున్నారు. బాపూజీనగర్ క్రాస్ రోడ్డు నుంచి ఫాతిమానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపులా ఉన్న రోడ్డును విస్తరించడంతో అభివృద్ధి పనులు చేయడానికి వీలవుతుంది.

అభివృద్ధి అత్యవసరం



చౌరస్తాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎమ్మెల్యే ఆదేశం మేరకు ఈ దిశగా అధికారులు ప్రణాళికలు తయారు చేయడం శుభ పరిణామం. – గద్దం నరహరి, కాజీపేట

చౌరస్తాకు కొత్తరూపం ఖాయం



గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా వెనుకబడిన కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి న బాధ్యత నాపై ఉంది. ప్రజల ఆకాంక్ష మేరకు చౌరస్తాను అందంగా తీర్చిదిద్దుతా. – నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే

'ఉపాధి' కూలీల వేతనాలు పెంచాలి

- బీకేఎంయూ జాతీయ నేత లింగారెడ్డి



డీఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

హన్మకొండ అర్బన్ : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ద్రవ్యో ల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని దినసరి వేతనాన్ని పెంచాలని, పార్లమెంట్ స్థాయి సంఘం 2024 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి చేసిన సూచనలు అమలు జరపాలని బీకేఎంయూ జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం సంఘం జిల్లా నాయకులతో కలిసి హనుమకొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి రమేశ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం 2005వ సంవత్సరంలో తీసుకొచ్చిన చారిత్రకాత్మక చట్టం ఫలితంగా గ్రామీణ పేదల జీవితాల్లో చెప్పుకోదగిన మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మునిగాల భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరు వెంకటరాజం, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, నాయకులు మహేందర్, స్వామి, భిక్షపతి, రాజయ్య, కుమార్ పాల్గొన్నారు.

మల్లికాంబలో ఎమ్మెల్యే దంపతుల అన్నదానం

హన్మకొండ అర్బన్ : నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులతో కలిసి సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి-వినయరాణి దంపతులు వారి వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్లికాంబ నిర్వాహకులకు కడియం ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం దంపతులు చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డించారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల, కల్యాణ్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



హన్మకొండ అర్బన్ : తెలంగాణ సైకాలజిస్టుల సంఘం 2025 సంవత్సర డైరీని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీవిద్య మాట్లాడుతూ జిల్లాలో సైకాలజీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని రక్షణ, ఆరోగ్య, విద్య, వైద్య శాఖల్లో సైకాలజిస్టును నియమించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దొమ్మేటి కల్యాణి, ఉపాధ్యక్షులు విక్రమ్ రెడ్డి, డాక్టర్ శివుడు, బుడిగం సునీత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు,పెన్నుల పంపిణీ



ప్యాడ్లు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రోటరీక్లబ్ సౌజన్యంతో సోమవారం పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోటరీ క్లబ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సాధినేని ప్రభాకర్‌రెడ్డి, జాతీయ యువజన అవార్డు గ్రహీత గంగోజు నరేష్‌లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు,

టాపర్లకు నగదు ప్రోత్సాహకం

హసన్‌పర్తి : పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1000 చొప్పున నగదు బహుమతి అందిస్తామని శ్రీసాయి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. మండలంలోని ముచ్చర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. పాఠశాలలో హెచ్‌ఎం రంగనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీసీపీ రవీందర్

ఖిలా వరంగల్: వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, కమాండెంట్ రాంప్రకాశ్, ఎంవీఐ జైపాల్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్ వద్ద వరంగల్ జిల్లా రవాణాశాఖ, టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, హెల్మెట్ ఉపయోగంపై అవగాహన, బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు.అనంతరం ఆర్టీఏ అధికారులు హె ల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ శోభన్‌బాబు, ఏఎంవీఐలు, టీజీఎస్పీ అధికారులు కృష్ణ, ఆర్ఐ రాజ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు

క్రీడలు శరీరారోగ్యానికి దోహదం

- కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి



గెలిచిన కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టుతో సీఐ సుధాకర్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఏఎస్సీ శుభాష్

కాజీపేట రూరల్ : క్రీడలు శరీరారోగ్యానికి ఎంతో దోహదపడుతాయని స్థానిక సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ రెండో మ్యాచ్‌ను ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శుభాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే డ్యూటీల్లో ఉంటూ పని ఒత్తిడిలను అధిగమించి క్రికెట్ టోర్నమెంట్స్‌లో పాల్గొని ఆడుతున్న రైల్వే ఉద్యోగులను వారు అభినందిచారు. మొదటి మ్యాచ్‌ని ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి, కాజీపేట బ్రాంచీ ప్రెసిడెంట్ ఎస్.ఆర్.వి.రావు ప్రారంభించి మాట్లాడారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే ఈఎల్ఎస్ స్టాఫ్ జట్టు-రైల్వే డీజిల్ ఇనిస్టిట్యూట్ జట్టు తలపడగా డీజిల్ ఇనిస్టిట్యూట్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో ఆర్‌పీఎఫ్ జట్టు-రైల్వే టీటీ మిషన్ జట్టు తలపడగా కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు ఘనవిజయం సాధించింది. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరి రాఘవేందర్, రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం .రాజయ్య, క్రికెట్ క్రీడల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, రైల్వే రిటైర్డ్ నాయకులు భిక్షపతి, ప్రేమ్‌కుమార్, రహమతుల్లా, గోపి, జానిబాబు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న దామోదర్

హన్మకొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కన్సూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సీనియర్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం హన్మకొండలోని ఎక్సైజ్ కాలనీలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి సైబర్ నేరగాళ్లు ప్రతి నెల సుమారు రూ.200 కోట్లు దోచుకుంటున్నారని, సంవత్సరానికి దాదాపు రూ.2400 కోట్లు వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. బహుమానాలు పేరిట లాటరీలు వచ్చాయని నమ్మించి మోసగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్యాల మనోహర్ రావు, ఎస్.హైమావతి, ఎ.శ్రీదేవి, జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు జ్యోత్స్న, సతీష్, మంజుల, సుమన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసమే ఓరియెంటేషన్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

ఖిలా వరంగల్ : విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్మా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ అడెపు శ్యాం తెలిపారు. 22 బుధవారం ఉదయం 8.30 నుంచి 5.30 గంటలకు ఉర్సుగుట్ట జంక్షన్‌లోని నాని గార్డెన్‌లో జరిగే ఓరియంటే షన్ ప్రోగ్రాంకు ఆధ్యాత్మిక గురువు శ్రీత్రిదండి చిన్న జీయర్ స్వామి రానున్నారని వారు తెలిపారు. సోమవారం నాని గార్డెన్‌లో ట్రస్మా, వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన వడుప్సా, ట్రస్మా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై ఓరియంటేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వడుప్సా, ట్రస్మా ప్రతినిధులు రాజు,కోడెం శ్రీధర్, రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, డి.శంకర్, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, సతీష్‌మూర్తి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, మోహన్, తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్త సమాచారం

కార్మికుల కష్టసుఖాల్లో అండగా ఉంటాం

హన్మకొండ అర్బన్ : కార్మికుల కష్టసుఖాల్లో ఎల్లవేళలా అండగా ఉంటామని త్రిచక్ర పాదుపు సొసైటీ అధ్యక్షుడు ఇస్సంపెల్లి సంజీవ అన్నారు. సొసైటీ ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ప్రారంభం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు రూ.3.39 కోట్ల టర్నోవర్‌కు చేరిందన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టీఎస్జీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్ : జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హనుమకొండ జిల్లా టీఎస్జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నేతలు టీచర్స్‌కాలనీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. కలిసిన వారిలో టీఎస్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు ఉన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

హసన్‌పర్తి : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని లయన్స్‌క్లబ్ జిల్లా సర్వీస్ కో–ఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి అన్నారు. హసన్‌పర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ చేశారు.

ప్రకాశ్‌కు ఉత్తమ పర్యావరణ అవార్డు

కాజీపేట : పట్టణానికి చెందిన పర్యావరణ పరిరక్షకుడు కె.ప్రకాశ్‌కు ఆదివారం రాత్రి రోటరీక్లబ్ వారు ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో ఘనంగా సన్మానించారు. 15 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొక్కల పరిరక్షణ, ప్లాస్టిక్ కవర్ల వాడకానికి వ్యతిరేకంగా ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రశంసలు అందుకుంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ జి.సాంబ రెడ్డి తెలిపారు. ద్వారకసాయి, నవయుగ, జవహర్, మారుతి నగర్, సదాశివ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కిషన్‌పుర, లష్కర్‌బజార్ ప్రాంతంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నయీంనగర్‌లో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు, హౌజింగ్ బోర్డు కాలనీ, భవాని నగర్, ఇందిరానగర్, కెఏఎల్ఎస్ రెడ్డి కాలనీ, సుమంగళి ఫంక్షన్ హాల్, సెయింట్ పీటర్స్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా నాయకులతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్ఓ వై.వీ. గణేష్‌కు వినతిపత్రం అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వరంగల్ : కాశిబుగ్గ 19వ డివిజన్‌లో స్మార్ట్ సిటీ నిధులతో సిద్ధయ్య హోటల్ ఎదురు వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలతభాస్కర్ సోమవారం ప్రారంభించారు. మంత్రి ఆదేశాలతో డివిజన్‌లో సుమారు రూ.5కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ర వీందర్, నాగరాజు, రాకేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలి

ఖిలా వరంగల్: గుడిసెవాసులు నివాసం ఉండే ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలని గుడిసెవాసుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోతు సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని తహసీల్ కార్యాలయం ఎదుట జక్కలొద్ది గుడిసెవాసులు ధర్నా చేపట్టారు.

వైభవంగా ఉర్సు నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించే కరీమాబాద్ మాషూక్ రబ్బానీ దర్గా ఉర్సు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దర్గా పీఠాధిపతి సయ్యద్ మొహినొద్దీన్ అహ్మద్ ఖుబ్బార్ ఖాద్రి (హసీబ్‌పాషా) తెలిపారు. సోమవారం కరీమాబాద్‌లోని పీఠాధిపతి గృహంలో ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆయన దర్గా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఖాలిద్‌పాషా, హబీబ్, అలం, ఖాద్రి,మతపెద్దలు పాల్గొన్నారు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మధ్యాహ్నం చింతల్ ఆర్ఎస్‌నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ 36వ డివిజన్ చింతల్ ఆర్ఎస్ నగర్‌కు చెందిన దాసరి శ్రీనివాస్(54) అప్పుల పాలయ్యాడు . మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: అసోసియేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాథమేటిక్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వారు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో సుబేదారిలోని రామన్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాఠశాలకు చెందిన సిరి చందన్, యుక్తశ్రీ, ప్రణయ్, సాయి శ్రీకర్, సూర్య వైష్ణవి, లాస్య, మోహిత్, రమణీత్, సంజన, రచనా వివిధ గణిత ఈవెంట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారని రామన్ స్కూల్ కరస్పాండెంట్ రాజేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులను, గణిత ఉపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డిని కరస్పాండెంట్ రాజేష్‌కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, ప్రిన్సిపాళ్లు స్రవంతి, రజిత అభినందించారు.

గ్యాస్ పైపు దగ్ధం

వరంగల్: వరంగల్‌లోని పాలిక్ మహేలా ప్రాంతంలో ఒక ఇంట్లో వంటగ్యాస్ పైపు దగ్ధం కావడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినట్లు అగ్నిమాపక అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

మడికొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌కు రోటరీ క్లబ్ వరంగల్ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు 2024-25 సంవత్సరానికి గాను ప్రజలకు వివిధ సేవలను అందించినందుకు ఆయనను గుర్తించి ఘనంగా సన్మానించినట్లు రోటరీ క్లబ్ వారు తెలిపారు.

మద్యం సేవించిన నలుగురికి సామాజిక సేవ శిక్ష

కాజీపేట : మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి కె.రాజశేఖర్‌రెడ్డి రెండు రోజుల సామాజిక సేవ శిక్షను ఖరారు చేసినట్లు ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది పట్టణ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ నలుగురు పట్టుబడ్డారు. దేవర సది, అలకుంట కుమారస్వామి, అలకుంట మల్లేష్, నర్రావుల రాకేష్‌లు మద్యం తాగి వాహనాలు నడిపినట్లుగా నిర్ధారణ జరగడంతో న్యాయమూర్తి సామాజిక సేవ శిక్షను ఖరారు చేశారు. వీరిని మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎదుట హాజరుపర్చగా కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించినట్లు సీఐ వివరించారు.

డీసీపీ శోభన్‌కుమార్‌కు సన్మానం

కాజీపేట అర్బన్ : హన్మకొండ హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం అంబేడ్కర్ బ్రాడ్ కాన్సెప్ట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాచకొండ ఎస్ఓటీ డీసీపీ పుల్ల శోభన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. మాదిగలు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ సీనియర్ నేత డాక్టర్ రామకృష్ణ తెలిపారు. మోహన్‌రావు, మాజీ ఎంపీ దయాకర్, ఏసీపీ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్ : కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా పాఠశాల క్రీడల సమాఖ్య జిమ్నాస్టిక్స్ పోటీలకు కందికొండ దేవకి ఎంపిక కాగా హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ సోమవారం అభినందించారు. దేవకిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్, జిమ్నాస్టిక్స్ కోచ్ నరేందర్ తదితరులు అభినందించారు.

కోటను సందర్శించిన విదేశీయులు




ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను సోమవారం యూరోప్ దేశస్తులు సందర్శించారు. ఈ సందర్భంగా శిల్పాల ప్రాంగణంలోని శిల్పకళా సంపదను వారు ఆసక్తిగా తిలకించారు. అనంతరం స్వయంభు లింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు విదేశీయులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టిజన్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

హన్మకొండ : విద్యుత్ ఆర్టిజన్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ట్రాన్స్‌కో వరంగల్ జోన్ చైర్మన్ బండారి ఐలయ్య, కన్వీనర్ కందికొండ వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ పిలుపులో భాగంగా చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం పెద్దమ్మగడ్డలోని ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయం ఎదుట చేపట్టారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి




కాళోజీ సెంటర్ : రంగశాయిపేట స్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్ : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం కె.రాములుపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించిన వా రిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో హెచ్‌ఎంను అవమానపర్చడాన్ని నిరసిస్తూ సోమవారం మధ్యాహ్నభోజన విరామ సమయాల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు.

కొత్తూరు జెండాలో చైన్ స్నాచింగ్

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు జెండా దగ్గర సోమవారం ఉదయం చైన్ స్నాచింగ్ జరిగినట్లు హనుమకొండ సీఐ సతీష్ తెలిపారు. కొత్తూరు జెండాలో నివాసం ఉంటున్న లక్ష్మీ కురగాయలకు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలో నుంచి గొలుసును అపహరించినట్లు ఆయన తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



చీరలు పంపిణీ చేస్తున్న ఏసీపీ

వరంగల్ చౌరస్తా : పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేని వని వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ అన్నారు. సోమవారం వరంగల్ గోవిందరాజులగుట్ట దేవస్థానం వద్ద ఆల య ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 40 మంది పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఇంతేజార్‌గంజ్ సీఐ సుకూర్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.